TGTEL /2018/75056

# తెలంగాణభూమి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

జర్నలిజంపై ఆసక్తి ఉందా ?

చక్కని వేదికగా తెలంగాణ భూమి దినపత్రికకు స్వాగతం
తెలంగాణ భూమి... ప్రజాపక్షం
పతి అక్షరం... ప్రజాయుధం
ప్రజల చేతుల్లో...పాశుపతాస్త్రంగా
తెలంగాణ భూమి 9 సం॥ గా
పాఠకలోకం మన్ననలందుకుని
అక్షర యజ్ఞం సాగిస్తూ...

దిన పత్రికలో పని చేయుటకు తెలుగు రెండు రాష్ట్రాల్లో ఔత్సాహికులకు ఆహ్వానం

యాడ్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను.

కె.ఎన్.స్వామి - 79898 70511

నల్గొండ | ఆగస్టు 13 గురువారం 2026 | సంపుటి : 9 | సంచిక : 55 | పేజీలు : 4 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : కొండ నరసింహస్వామి

NALGONDA | THURSDAY AUGUST 13 2026 | VOL:9 ISSUE: 55 | PAGES:4 | Rs. 4:00 | EDITOR: Konda Narasimha swamy

# బకాయిలు చెల్లించని రైస్ మిల్లులపై ఉక్కుపాదం

డిఫాల్ట్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అంశంపై పరిశీలన

బకాయిల వసూళ్లకు ప్రత్యేక విధానం రూపొందించాలి : సీఎం రేవంత్‌రెడ్డి

మిల్లర్ల బ్లాక్‌మెయిల్‌ను సహించేది లేదు

ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలతో గోదాంల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్

ప్రతి జిల్లాకు నోడల్ అధికారిని నియమించాలని ఆదేశం



హైదరాబాద్: ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ శాఖపై బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు

(మిగతా 2వ పేజీలో..)

## చంద్రబాబు ఒక విజనరీ లీడర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



నిజమైన అభివృద్ధికి చంద్రబాబు చిరునామా అన్న ద్రౌపది ముర్ము

ఏపీ అభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంస

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్నారన్న రాష్ట్రపతి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా దక్షతపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని కొనియాడిన ఆమె... రాష్ట్రంలో నిజమైన అభివృద్ధికి ఆయనే అసలైన చిరునామా అని స్పష్టం చేశారు. సాంకేతికత, పాలన, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చేపట్టిన సంస్కరణలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు

(మిగతా 2వ పేజీలో..)

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు..డీలిమిటేషన్‌కు సీఎం విజయ్ నో

హైదరాబాద్ : అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమిళనాడు ప్రభుత్వం వరుస తీర్మానాలను ప్రవేశపెడుతోంది. మొన్న రాష్ట్రగీతం, నిన్న నీట్.. నేడు డీలిమిటేషన్‌పై తీర్మానాలను తీసుకువచ్చింది. నియోజకర్గాల పునర్ వ్యవస్థీకరణ కోసం కేంద్రం తీసుకువచ్చిన బిల్లును వ్యతిరేకించింది. అదే సమయంలో మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇచ్చింది. ప్రస్తుతమున్న 543 సీట్లతోనే దానిని అమలు చేయాలని విజయ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయని ఈ సందర్భంగా సీఎం విజయ్ అన్నారు. జనాభా

(మిగతా 2వ పేజీలో..)



## మేం టీ హబ్ తెస్తే.. రేవంత్ రెడ్డి అనుముల హబ్స్ అనే పథకాన్ని తెచ్చాడు.. కేటీఆర్ విమర్శ

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు గతంలో టీ–హబ్ ఏర్పాటు చేశామని, అయితే ప్రస్తుతం 'అనుముల హబ్స్' పేరుతో కుటుంబ ఆధారిత కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారని సెటైర్ వేశారు.నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ–హబ్‌ను నిర్మించామని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం కుటుంబ సభ్యుల ఆధారంగా, ఎలాంటి ఆవిష్కరణలు, ఉద్యోగులు లేకుండా 'అనుముల హబ్స్'ను రూపొందిస్తున్నారని విమర్శించారు. అనుముల కుటుంబానికి చెందిన వారైతే తక్కువ ధరకు ప్రభుత్వ భూములు కేటాయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. దీనిపై ఎలాంటి ప్రశ్నలు అడగడం



లేదని వ్యాఖ్యానించారు.'అనుముల కొండల్‌రెడ్డి'ని శతాబ్దపు గొప్ప ఆవిష్కర్తగా ప్రతిపాదిస్తున్నానంటూ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు

(మిగతా 2వ పేజీలో..)

## జెన్–జీకి మోదీ కీలక సూచనలు.. షార్ట్‌కట్‌లకు దూరంగా ఉండండి

జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరమన్న ప్రధాని నరేంద్ర మోదీ


సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన

గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు

మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్–జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో

(మిగతా 2వ పేజీలో..)



## తెలంగాణలో 'ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల' పథకం ప్రారంభం: నియోజకవర్గానికి వెయ్యి మందికి లబ్ధి

బీసీ మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్న ప్రభుత్వం

విధి విధానాలను రేపు ప్రకటించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆన్‌లైన్, మీ–సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల



(మిగతా 2వ పేజీలో..)

## అమెరికాలో అదానీపై కేసు కొట్టివేత.. మోదీపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు

వెనక చాలా పెద్ద కథ ఉందన్న రాహుల్ గాంధీ వ్యాఖ్య

మోదీ భారత ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపణ




## డియర్ యంగ్ ఫ్రెండ్స్.. యువతకు సీఎం చంద్రబాబు సందేశం

నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

యువతకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

యువతే మన శక్తి, బలం, రేపటి ఆశ అని వ్యాఖ్య

యువత కలలు సాకారం చేసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ, అవకాశాలు కల్పిస్తామని హామీ

మెరుగైన భవిష్యత్తును అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం

ఈ భవిష్యత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపు

నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం (ఆగస్టు 12) సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు "డియర్ యంగ్ ఫ్రెండ్స్" అంటూ రాష్ట్ర యువతకు శు



భాకాంక్షలు తెలిపారు. యువతే మన శక్తి, బలం అని, రేపటి భవిష్యత్తుకు వారే ఆశాకిరణాలని ఆయన అభివర్ణించారు. యువత ఆశయాలకు అనుగుణంగా, వారికి బంగారు భవిష్యత్తును అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం

తెలంగాణభూమి
తెలుగు దినపత్రిక

## మేం టీ హబ్ తెస్తే.. రేవంత్ రెడ్డి అనుముల హబ్స్ అనే పథకాన్ని తెచ్చాడు.. కేటీఆర్ విమర్శ

మొదటి పేజీ తరువాయి)

సంధించారు. ఎలాంటి పెట్టుబడి లేకుండానే 'టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే రక్షణ రంగ సంస్థను ఏర్పాటు చేసి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించారని ఆరోపించారు. మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలోని లక్షలాది మంది యువతకు ప్రభుత్వ విలువైన భూములను వందల కోట్ల రూపాయల మేర ఎలా పొందాలో బోధించాలని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ 'మ్యాజిక్ ట్రిక్'ను కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం చేయాలని ప్రశ్నించారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు..డీలిమిటేషన్‌కు సీఎం విజయ్ నో

మొదటి పేజీ తరువాయి)

ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే నష్టం వాటిల్లొచ్చని హెచ్చరించారు. "ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను అలాగే కొనసాగించాలి. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం కేటాయించిన స్థానాలను శాశ్వతం చేయాలి. రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి" అని కేంద్రం ముందు మూడు డిమాండ్లు ఉంచారు.

## చంద్రబాబు ఒక విజనరీ లీడర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి, ముఖ్యంగా అమరావతి నిర్మాణానికి, ఐటీ, పారిశ్రామిక రంగాల పురోగతికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దూరదృష్టి కలిగిన నాయకత్వంతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రపతి నుంచి వచ్చిన ఈ ప్రశంసలపై టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన కుటుంబంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను బహుకరించారు. ఆ పుస్తకంలోని రాజధాని అమరావతి విశేషాలు, ఫొటోలను రాష్ట్రపతి ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టిని కొనియాడుతూ, ఆయన నిజమైన అభివృద్ధికి చిరునామా అని, ఒక విజనరీ లీడర్ అని రాష్ట్రపతి ప్రశంసల వర్షం కురిపించారు.అంతేకాకుండా, ఎంపీ అప్పలనాయుడి నిబద్ధతను రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంట్ సమావేశాలకు ప్రతిరోజూ సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరు నమోదు చేసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సంస్కారం, నిరాడంబరత కలిగిన అప్పలనాయుడిని చూస్తుంటే "నన్ను నేను చూసుకున్నట్లే ఉంది" అని అన్నారు.

## జెన్-జీకి మోదీ కీలక సూచనలు.. షార్ట్‌కట్‌లకు దూరంగా ఉండండి

మొదటి పేజీ తరువాయి)

అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు.యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

## తెలంగాణలో 'ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల' పథకం ప్రారంభం: నియోజకవర్గానికి వెయ్యి మందికి లబ్ధి

మొదటి పేజీ తరువాయి)

(బీసీ) మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్లు పంపిణీ చేసే సరికొత్త సంక్షేమ పథకాన్ని రేపు అధికారికంగా ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శ్రమను తగ్గించి, వేగంగా పని చేసుకునేందుకు వీలుగా ఈ అధునాతన ఆటోమేటిక్ మిషన్లను అందించబోతున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో వెయ్యి మంది మహిళలకు మిషన్లు అందించబోతున్నారు. లబ్ధిదారుల వయోపరిమితి, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి, అవసరమయ్యే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల వివరాలను మంత్రి రేపు అధికారికంగా వెల్లడిస్తారు. ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించే తేదీలను, ప్రక్రియ మార్గదర్శకాలను ప్రకటించనున్నారు.

# బకాయిలు చెల్లించని రైస్ మిల్లులపై ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఉద్దేశ పూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు.కేబినెట్ సబ్‌కమిటీలో దీనిపైన చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలని మార్గనిర్దేశం చేశారు. మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించనని హెచ్చరించారు.బకాయిల వసూళ్లకు ఒక విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల్లో గోదాంల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని ఆదేశించారు.గోదాంల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను వినియోగించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## అమెరికాలో అదానీపై కేసు కొట్టివేత.. మోదీపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు

మొదటి పేజీ తరువాయి)

అమెరికాలో అదానీకి సంబంధించిన కేసు కొట్టివేతపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ పరిణామంపై ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని ఘాటు విమర్శలు చేశారు. అమెరికా కోర్టు నిర్ణయం వెనక మరింత కథ ఉందని వ్యాఖ్యానించారు.అమెరికాలో అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ సహా ఇతరులపై నమోదైన దాదాపు రెండేళ్ల నాటి క్రిమినల్ కేసును న్యూయార్క్‌లోని ఫెడరల్ న్యాయమూర్తి సోమవారం కొట్టివేశారు. ఈ కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని అమెరికా న్యాయశాఖ కోర్టును కోరింది.ఈ నేపథ్యంలో కేసు కొట్టివేత వార్త స్క్రీన్‌షాట్‌ను రాహుల్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేస్తూ మోదీపై విమర్శలు చేశారు. "పైకి కనిపిస్తున్నదానికంటే ఈ వ్యవహారం వెనుక ఇంకా చాలా ఉంది. ఒత్తిడికి లోనైన ప్రధాని భారత ప్రయోజనాలను తాకట్టు పెట్టాల్సి వచ్చింది. అందుకు దేశం భారీ మూల్యం చెల్లిస్తోంది" అని రాసుకొచ్చారు.ఈ కేసులో భారత్‌లోని ప్రభుత్వ అధికారులకు లంచం ఇచ్చేందుకు కుట్ర చేశారన్నది ప్రధాన ఆరోపణ. సౌర విద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్టు దక్కించుకునేందుకు ఈ ప్రయత్నం జరిగిందని 2024 నవంబరులో అమెరికా అధికారులు అభియోగాలు నమోదు చేశారు. అయితే అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను అప్పట్లోనే ఖండించింది. తమ సంస్థలు, అధికారులు చట్టాలకు అనుగుణంగానే వ్యవహరించారని స్పష్టం చేసింది.కేసును కొట్టివేయాలన్న న్యాయశాఖ నిర్ణయంపై న్యాయమూర్తి నికోలస్ గరాఫిస్ గతంలో ప్రశ్నలు లేవనెత్తారు. నిర్ణయానికి మరిన్ని వివరణలు ఇవ్వాలని కోరారు. నిందితులు అమెరికా పౌరులు కాదని, వారు ఎప్పుడూ అమెరికా కోర్టుకు హాజరు కాలేదని న్యాయశాఖ పేర్కొంది.

## డియర్ యంగ్ ఫ్రెండ్స్.. యువతకు సీఎం చంద్రబాబు సందేశం

మొదటి పేజీ తరువాయి)

చేశారు.ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ.. "ప్రియమైన యువ మిత్రులారా, మీరే మా శక్తి. మీరే మా బలం. రేపటి ఆశ, వాగ్దానం మీరే" అని పేర్కొన్నారు. ప్రతి యువతీ యువకుడు తమకు నచ్చిన మార్గాన్ని ఎంచుకుని, ఆశించిన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, అవకాశాలు కల్పించే భవిష్యత్తును నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. యువత కలలు కనడమే కాకుండా, వాటిని సాకారం చేసుకునేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు."మేము ఈ రోజు చేస్తున్న ప్రతి పని అంతిమంగా మీకు మెరుగైన రేపటిని అందించడం కోసమే. విస్తృత అవకాశాలు, కలలు కనే స్వేచ్ఛ, వాటిని నిజం చేసుకునేందుకు అవసరమైన మద్దతుతో కూడిన భవిష్యత్తును అందించడమే మా ధ్యేయం" అని చంద్రబాబు వివరించారు. ఈ భవిష్యత్ నిర్మాణంలో యువత కూడా భాగస్వాములు కావాలని, అందరం కలిసికట్టుగా నవ సమాజాన్ని నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. యువతకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తనతో కలిసి రావాలని ఆహ్వానించారు.

## రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

రాజ్యసభలో బుధవారం 'లుంగీవాలా' వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు.సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే 'లుంగీవాలా' అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని, దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు. తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేశారు. ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి.



తెలంగాణభూమి
తెలుగు దినపత్రిక



# దళితుడిపై దాడి జరిగితే పోలీసుల మౌనం ఎందుకు?

## ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వేముల శ్రీను ఫిర్యాదు

**పోలీసుల నిర్లక్ష్యంపై ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు**

**దాడి చేసిన వారిపై కేసులు.. నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**నల్లగొండ, ఆగస్టు 12:**

దళితుడిపై మూకుమ్మడి దాడి జరిగి, బాధితుడు పోలీసులను ఆశ్రయించినా న్యాయం చేయకుండా కాలయాపన చేస్తున్న పోలీసు అధికారుల తీరుపై సామాజిక ఉద్యమకారుడు, రిపోర్టర్ వేముల శ్రీను తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఈరోజు జరిగిన సమీక్షా సమావేశానికి హాజరైన ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను వేముల శ్రీను కలిసి తనపై జరిగిన దాడి, అనంతరం శాలి గౌరారం పోలీసులు వ్యవహరించిన తీరును వివరించారు.పెర్క కొండారం గ్రామానికి, వందలాది మంది రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లే రహదారి మరమ్మతుల కోసం మట్టి అవసరమైన నేపథ్యంలో ఊటుకూరు గ్రామంలోని ఎలమరాజు కుంట అలుగు ప్రాంతంలో గతంలో మట్టి తీసిన ప్రదేశం నుంచే మట్టి తీసుకోవాలని నచ్చజెప్పే ప్రయత్నం చేసిన సమయంలో తనపై కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారని శ్రీను తెలిపారు.దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శాలి గౌరారం పోలీసులకు, జిల్లా ఎస్పీకి, డీఎస్పీకి ఫిర్యాదు చేసినప్పటికీ తగిన స్పందన లేకపోవడం పోలీసు వ్యవస్థపై అనేక అనుమానాలకు తావిస్తోందని ఆయన ఎస్సీ కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

**"దళితుడిపై దాడి జరిగితే పోలీసులు మౌనం వహించడానికి కారణమేంటి?**

**దాడి చేసిన వారి సామాజిక పలుకుబడే చట్టం కంటే గొప్పదా?**

**లేక రాజ్యాంగం ముందు అందరూ సమానమేనా?"'**

అని వేముల శ్రీను ప్రశ్నించారు.రైతుల రాకపోకలకు ఉపయోగపడే బాట బాగుపడాలని మాట్లాడినందుకు తనపై దాడి జరిగిందని, దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినా పోలీసులు స్పందించకపోవడం బాధితుడికి న్యాయం చేయకుండా నిందితులకు రక్షణ కల్పించే ధోరణిగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు.

**"దాడి చేసిన చేతులకు చట్టం సంకెళ్లు వేయాలి...**

**ఫిర్యాదు చేసిన బాధితుడి గొంతును పోలీసులు వినాలి...**

నిందితుల పలుకుబడికి చట్టం తలవంచకూడదు..." అని ఆయన స్పష్టం చేశారు.ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు సమర్పించిన విజ్ఞప్తిలో తనపై దాడికి పాల్పడిన వ్యక్తులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై స్పందించకుండా నిర్లక్ష్యం వహించిన పోలీసు ఉన్నతాధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు వేముల శ్రీను తెలిపారు.దళితులపై దాడులు జరిగినప్పుడు పోలీసు




అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అది కేవలం ఒక వ్యక్తికి జరిగిన అన్యాయం కాదని, రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వం, సామాజిక న్యాయం, చట్ట పరిరక్షణకు సవాల్ అని ఆయన అన్నారు."నేను ఎవరి భూమిని అడగలేదు... ఎవరి హక్కును లాక్కోవడానికి వెళ్లలేదు. రైతుల బాట బాగుపడాలని మాట్లాడాను. అందుకు దాడి చేశారు. దాడి తర్వాత న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించాను. అక్కడ కూడా మౌనమే ఎదురైంది. ఇక ఈ మౌనాన్ని ప్రశ్నించాల్సిందే." అని శ్రీను ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతులను దాడులతో అణచివేయాలని చూసినా, పోలీసుల నిర్లక్ష్యంతో భయపెట్టాలని చూసినా తాను వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు.

**"కులం చూసి చట్టం మారకూడదు...**

పలుకుబడి చూసి పోలీసుల వైఖరి మారకూడదు...బాధితుడి సామాజిక స్థాయి చూసి న్యాయం తూకం వేయకూడదు.రాజ్యాంగం ఇచ్చిన హక్కుల కోసం చివరి వరకు పోరాడుతాం!"అని సామాజిక ఉద్యమకారుడు, రిపోర్టర్ వేముల శ్రీను తెలిపారు.

# క్రీజ్‌ను వదిలి కామెంటరీ బాక్స్‌లోకి.. రహానే కొత్త అవతారం



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజింక్య రహానే తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నాడు. ఇన్నాళ్లు బ్యాట్‌తో క్రీజ్‌లో పరుగుల వరద పారించిన రహానే, ఇప్పుడు కామెంటరీ బాక్స్‌లో తన గళం వినిపించడానికి సిద్ధమయ్యాడు. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్‌తో అతను వ్యాఖ్యాతగా అరంగేట్రం చేయనున్నాడు.దాదాపు 18 ఏళ్ల సుదీర్ఘ ఫస్ట్-క్లాస్ కెరీర్‌కు ఇటీవలే వీడ్కోలు పలికిన 37 ఏళ్ల రహానే, ఇకపై ఆటను మరో కోణంలో విశ్లేషించనున్నాడు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, సోనీ లివ్‌లో ప్రసారమయ్యే ఈ సిరీస్‌కు అతను కామెంటరీ ప్యానెల్‌లో చేరాడు. భారత్ తరపున 85 టెస్టులు ఆడిన రహానే 12 సెంచరీలు, 26 అర్ధ సెంచరీలతో 5,077 పరుగులు సాధించాడు. అతని అపార అనుభవం అభిమానులకు ఆటను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని భావిస్తున్నారు.ఈ కొత్త బాధ్యతపై రహానే స్పందిస్తూ.. "టెస్ట్ క్రికెట్ అత్యున్నతమైనది. ఇన్నాళ్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహించాక, ఇప్పుడు ఆటను మరో కోణం నుంచి చూడటం గౌరవంగా ఉంది. నా అనుభవాలను పంచుకుంటూ, ఆటలోని వ్యూహాలను, కీలక క్షణాలను అభిమానులకు వివరిస్తాను" అని తెలిపాడు. రహానే చేరికతో తమ ప్రసారాలకు మరింత బలం చేకూరుతుందని సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా బిజినెస్ హెడ్ రాజేశ్ కౌల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# గుజరాత్‌కు తిరిగి వెళ్లాలనుకున్న హార్దిక్ పాండ్యా.. ఆ కండిషన్‌తో ఆఖర్లో బెడిసికొట్టిన డీల్!

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఐపీఎల్ భవిష్యత్తుపై నెలకొన్న ఉత్కంఠకు మరో కొత్త మలుపు తోడైంది. ముంబై ఇండియన్స్‌ను వీడాలని నిర్ణయించుకున్న అతడు, 2027 సీజన్‌కు ముందు తన పాత ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌తో చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే, కెప్టెన్సీ పగ్గాలు తనకే ఇవ్వాలనే షరతు పెట్టడంతో ఈ డీల్ ముందుకు సాగలేదని తెలుస్తోంది. దీంతో అతని భవిష్యత్తు మరింత సంక్లిష్టంగా మారింది. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ప్రకారం.. పాండ్యాను తిరిగి జట్టులోకి తీసుకునేందుకు గుజరాత్ ఫ్రాంచైజీ తొలుత సుముఖంగానే ఉంది. ఈ విషయాన్ని ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో చర్చించగా, అతడు కూడా తన అంగీకరించాడు. కానీ, జట్టులోకి రావాలంటే కెప్టెన్సీ తనకే ఇవ్వాలని హార్దిక్ షరతు విధించడంతో నిర్ణయాధికారంలో ఉన్న ప్రతి ఒక్కరూ దీనికి 'నో' చెప్పినట్లు సమాచారం."అతడు తిరిగి రావడానికి ఫ్రాంచైజీకి ఎలాంటి అభ్యంతరం లేదు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తోనూ చర్చించాం, అతను కూడా సరే అన్నాడు. కానీ, కెప్టెన్సీ షరతు పెట్టడంతో అందరూ వద్దన్నారు" అని ఫ్రాంచైజీ వర్గాలు తెలిపినట్లు సదరు పత్రిక పేర్కొంది.అయితే, ఈ విషయంపై హార్దిక్ పాండ్యా ప్రతినిధిని సంప్రదించగా, అతడు భిన్నమైన వాదన వినిపించాడు. హార్దిక్ ఏ ఫ్రాంచైజీతోనూ నేరుగా బదిలీ లేదా ట్రేడ్ గురించి చర్చలు జరపలేదని స్పష్టం చేశాడు. ఏవైనా సంప్రదింపులు జరిగితే, అవి ముంబై ఇండియన్స్ ద్వారానే జరుగుతాయని తెలిపాడు. ప్రస్తుతం హార్దిక్ చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌తో కూడా ట్రేడింగ్ కోసం చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.హార్దిక్ పాండ్యా నాయకత్వంలోనే గుజరాత్ టైటాన్స్ 2022లో టైటిల్ గెలిచి, 2023లో ఫైనల్‌కు చేరిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అతడు తన పాత జట్టు ముంబై ఇండియన్స్‌కు తిరిగి వచ్చాడు. ముంబైలో రోహిత్ శర్మ స్థానంలో కెప్టెన్ అవ్వడంతో అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొన్నాడు. డ్రెస్సింగ్ రూంలోనూ రోహిత్‌కు ఉన్నంత గౌరవం, పట్టు హార్దిక్‌కు లభించలేదని వార్తలు వచ్చాయి. మరోవైపు ముంబై యాజమాన్యం జట్టును పునర్‌నిర్మించాలని చూస్తోంది. ఈ క్రమంలో హార్దిక్‌తో సహా పలువురు సీనియర్లను వదులుకునే అవకాశం ఉంది.



# ద్రవిడ్ పేరిట చెక్కుచెదరని మూడు రికార్డులు.. క్రికెట్ చరిత్రలోనే ప్రత్యేకం.. సచిన్‌కు కూడా సాధ్యం కాలేదు!



భారత క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడిగా, అసలు సిసలైన టెస్ట్ ప్లేయర్‌గా కీర్తి గడించిన ఆటగాడు రాహుల్ ద్రవిడ్. తన అద్భుతమైన టెక్నిక్, అచంచలమైన మానసిక దృఢత్వం, ఎలాంటి ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా ఆడే నైజంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నాడు. అభిమానులు ముద్దుగా 'ది వాల్' అని పిలుచుకునే ద్రవిడ్, తన కెరీర్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి 500కు పైగా మ్యాచ్‌లలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. టెస్టుల్లో ఇప్పటికీ భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా ఉన్నాడు. అయితే, కేవలం పరుగులు, గణాంకాలకు మించి ద్రవిడ్ భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేశాడు. అతడు తన టెస్ట్ కెరీర్‌లో సాధించిన కొన్ని రికార్డులు బ్రేక్ చేయడం దాదాపు అసాధ్యం. అలాంటి మూడు అరుదైన రికార్డుల గురించి తెలుసుకుందాం.

1. టెస్టుల్లో అత్యధిక బంతులు ఎదుర్కొన్న ఆటగాడు

టెస్ట్ క్రికెట్‌లో ఓ బ్యాటర్ ఓపిక, సహనానికి ఇది గొప్ప నిదర్శనం. రాహుల్ ద్రవిడ్ తన టెస్ట్ కెరీర్‌లో ఏకంగా 31,258 బంతులను ఎదుర్కొన్నాడు. ప్రత్యర్థి బౌలర్లను అలసిపోయేలా చేయడంలో అతనికి అతనే సాటి. క్రికెట్ చరిత్రలో మరే బ్యాటర్ కూడా ఇన్ని బంతులు ఆడలేదు. ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్న 'గాడ్ ఆఫ్ క్రికెట్' సచిన్ టెండూల్కర్ కూడా 29,437 బంతులతో ద్రవిడ్ వెనుకే నిలిచాడు. ఇది ద్రవిడ్ క్రీజులో ఎంత పట్టుదలగా నిలబడేవాడో స్పష్టం చేస్తుంది.

2. క్రీజులో అత్యధిక సమయం గడిపిన రికార్డు

అత్యధిక బంతులు ఆడటమే కాదు, క్రీజులో అత్యధిక సమయం గడిపిన రికార్డు కూడా ద్రవిడ్ పేరిటే ఉంది. తన కెరీర్‌లోని 286 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో కలిపి 44,152 నిమిషాల పాటు క్రీజులో నిలిచాడు. గంటల తరబడి ఏకాగ్రత కోల్పోకుండా బ్యాటింగ్ చేయడం అతని ప్రత్యేకత. ఈ విషయంలోనూ సచిన్ టెండూల్కర్ (41,304 నిమిషాలు) రెండో స్థానంలోనే ఉన్నాడు. విదేశీ పర్యటనల్లో కఠినమైన పిచ్‌లపై భారత జట్టుకు ద్రవిడ్ అందించిన సేవలకు ఈ గణాంకాలే నిలువుటద్దం.

3. అత్యధిక సెంచరీ భాగస్వామ్యాలు

క్రికెట్ అనేది ఒక జట్టు క్రీడ అని ద్రవిడ్ పదేపదే నిరూపించాడు. అతడు తన టెస్ట్ కెరీర్‌లో ఏకంగా 88 సార్లు సెంచరీ భాగస్వామ్యాల్లో పాలుపంచుకున్నాడు. ఇది అతని వ్యక్తిగత ప్రతిభకే కాకుండా జట్టుకు వెన్నెముకగా నిలిచిన తీరుకు నిదర్శనం. ఈ జాబితాలోనూ 86 సెంచరీ భాగస్వామ్యాలతో సచిన్ రెండో స్థానంలో ఉన్నాడు. ముఖ్యంగా సచిన్-ద్రవిడ్ జోడీ టెస్టుల్లో 20 సార్లు శతక భాగస్వామ్యాలు నెలకొల్పడం మరో విశేషం.ఆటగాడిగా తన 164 టెస్టుల్లో 52.31 సగటుతో 13,288 పరుగులు చేసిన ద్రవిడ్, 36 సెంచరీలు, 63 అర్ధ సెంచరీలు సాధించాడు. ఇక, 344 వన్డేలలో 10,889 పరుగులు చేశాడు. ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కూడా హెడ్ కోచ్‌గా భారత క్రికెట్‌కు సేవలను కొనసాగించాడు. అతని మార్గదర్శకత్వంలోనే భారత అండర్-19 జట్టు 2018లో ప్రపంచకప్ గెలుచుకోగా, సీనియర్ జట్టు 2024లో టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడింది. అంతేగాక 2023లో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్, వన్డే ప్రపంచకప్ ఫైనల్స్‌కు కూడా జట్టును నడిపించాడు. ఇలా ఆటగాడిగా, కోచ్‌గా భారత క్రికెట్‌కు ద్రవిడ్ అందించిన సేవలు చిరస్మరణీయం.

తెలంగాణభూమి
తెలుగు దినపత్రిక

## హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్‌కు నాపై క్రష్.. మెసేజ్‌లు చేస్తుంటాడు: మల్లికా శెరావత్



బాలీవుడ్ నటి మల్లికా శెరావత్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. హాలీవుడ్ సూపర్‌స్టార్ టామ్ క్రూజ్‌కు తనపై క్రష్ ఉందని, ఆయన తనకు సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా మెసేజ్‌లు కూడా చేస్తుంటారని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. త్వరలో ప్రారంభం కానున్న 'ది ట్రెయిటర్స్ 2' అనే రియాలిటీ షోలో ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ షోలో తోటి కంటెస్టెంట్ ఆదిత్య కులశ్రేష్ఠ, "మీకు ఎవరిపైనైనా క్రష్ ఉందా? లేక మీపైనే అందరికీ క్రష్ ఉంటుందా?" అని మల్లికాను ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ.. "నాపైనే అందరికీ క్రష్ ఉంటుంది. ఇటీవల టామ్ క్రూజ్‌కు కూడా నాపై క్రష్ ఏర్పడింది. నేను అబద్ధం చెప్పడం లేదు. నా దగ్గర ఫోన్ ఉండుంటే, మేమిద్దరం కలిసి పార్టీ చేసుకున్న వీడియోలను మీకు చూపించేదాన్ని" అని బదులిచ్చారు. టామ్ క్రూజ్ అద్భుతమైన వ్యక్తి అని ఆమె కితాబిచ్చారు. అయితే, ఇవి కేవలం మల్లికా శెరావత్ చేసిన వ్యాఖ్యలు మాత్రమేనని, దీనిపై టామ్ క్రూజ్ లేదా అతని ప్రతినిధుల నుంచి ఎలాంటి అధికారిక స్పందన గానీ, ధ్రువీకరణ గానీ రాలేదని సమాచారం.

ఆగస్టు 13 నుంచి 'ది ట్రెయిటర్స్ 2'

ప్రముఖ రియాలిటీ షో 'ది ట్రెయిటర్స్' మొదటి సీజన్ విజయవంతం కావడంతో, ఇప్పుడు రెండవ సీజన్ రాబోతోంది. కరణ్ జోహార్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ షో ఈ నెల 13 నుంచి ప్రైమ్ వీడియోలో ప్రత్యేకంగా ప్రసారం కానుంది. ఇది ఒక స్ట్రాటజీ ఆధారిత గేమ్ షో. ఇందులో కంటెస్టెంట్లను రహస్యంగా 'ఫెయిత్‌ఫుల్స్', 'ట్రెయిటర్స్'గా విభజిస్తారు. మోసం, వ్యూహాలు, పొత్తుల ద్వారా చివరికి విజేతను నిర్ణయిస్తారు. ఈ సీజన్‌లో మల్లికా శెరావత్‌తో పాటు మునవర్ ఫరూఖీ, శ్వేతా తివారీ, రియా చక్రవర్తి, క్రిస్టల్ డిసౌజా, దలీప్ తాహిల్, అభిషేక్ మల్హాన్ వంటి పలు రంగాలకు చెందిన ప్రముఖులు కంటెస్టెంట్లుగా పాల్గొంటున్నారు. మొత్తం మీద షో ప్రసారం కాకముందే మల్లికా వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా దీనిపై ఆసక్తి నెలకొంది.

## కూతురి కోసం దీక్ష, ఊరి కోసం పోరాటం.. ఆసక్తి రేపుతున్న రవితేజ 'ఇరుముడి' ట్రైలర్

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా, విలక్షణ దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇరుముడి'. ఎన్నో అంచనాల నడుమ ఈ సినిమా అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర బృందం బుధవారం నాడు ప్రత్యేకమైన ఈవెంట్ లో విడుదల చేసింది. భక్తి, యాక్షన్, తండ్రీకూతుళ్ల సెంటిమెంట్ అంశాల కలబోతగా కట్ చేసిన ఈ ట్రైలర్, సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ట్రైలర్ ప్రకారం, ఈ సినిమాలో రవితేజ 'త్రినాథ్' అనే తండ్రి పాత్రలో కనిపించనున్నారు. మద్యపానానికి బానిసైనప్పటికీ, తన కూతురి (బేబీ నక్షత్ర) బాగు కోసం ప్రతి ఏటా 41 రోజుల పాటు కఠినమైన అయ్యప్ప దీక్షను చేపడతాడు. ఆ సమయంలో సంపూర్ణంగా మద్యపానానికి దూరంగా ఉంటూ ఎంతో నిష్ఠగా ఉంటాడు. అయితే అదే సమయంలో వారి ఊరిలో వరుసగా పాఠశాల విద్యార్థినులు అనుకోని పరిస్థితుల్లో మరణిస్తుంటారు. ఈ హత్యల వెనుక ఉన్న నిజాన్ని ఛేధించే క్రమంలో త్రినాథ్ చిక్కుకుంటాడు. అయితే, దీక్ష నియమాల ప్రకారం ఎవరితోనూ గొడవ పడకూడదు, హింసకు పాల్పడకూడదు. సరిగ్గా ఇదే అదనుగా భావించిన ప్రతినాయకులు అతనిపై దాడులకు తెగబడతారు. దీక్షలో ఉన్న సమయంలో తన కూతురిని, ఊరి ప్రజలను ఎలా కాపాడుకున్నాడు? అనేదే ఈ చిత్ర కథాంశంగా తెలుస్తోంది. తండ్రీకూతుళ్ల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు, అయ్యప్ప భక్తి నేపథ్యం, ఉత్కంఠ రేపే మిస్టరీ, యాక్షన్ అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. రవితేజకు జంటగా ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, సీనియర్ నటుడు సాయి కుమార్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. 'మజిలీ', 'నిన్ను కోరి' వంటి విజయవంతమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన "ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు.." పాట మంచి స్పందన రాబట్టుకోగా, ఇప్పుడు ట్రైలర్ కూడా సినిమాపై భారీ అంచనాలను నెలకొల్పింది. రొటీన్ కమర్షియల్ చిత్రాలకు భిన్నంగా, రవితేజ నుంచి ఒక కొత్త తరహా సినిమా రాబోతోందని ప్రేక్షకులు భావిస్తున్నారు.







## త్రిషను డిప్యూటీ సీఎం ఎప్పుడు చేస్తారు?.. సీఎం విజయ్‌పై ఏఐఏడీఎంకే నేత సెటైర్

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, ప్రముఖ నటి త్రిష కృష్ణన్‌ను ముడిపెడుతూ మరో రాజకీయ వివాదం చెలరేగింది. విజయ్‌తో అనేక చిత్రాలలో నటించిన త్రిషను ఎప్పుడు ఉప ముఖ్యమంత్రిని చేస్తారంటూ ఏఐఏడీఎంకే నేత, మాజీ మంత్రి ఆర్.బి. ఉదయకుమార్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. ఉదయకుమార్ మాట్లాడిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అందులో ఆయన, టీవీకే ప్రభుత్వం.. ముఖ్యమంత్రితో సన్నిహితంగా ఉన్నవారికే ప్రభుత్వ పదవులు కట్టబెడుతోందని ఆరోపించారు. ముఖ్యంగా, విజయ్ సినిమాలకు పనిచేసిన నిర్మాతలు, సాంకేతిక సిబ్బందిని ప్రభుత్వంలోని కీలక స్థానాల్లో నియమిస్తున్నారని విమర్శించారు. ఆలయ ట్రస్టీ, న్యూఢిల్లీలో తమిళనాడు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, సీఎం వ్యక్తిగత కార్యదర్శి, రాష్ట్ర ఫిల్మ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ హెడ్, ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన వారిని ఉదహరించారు. ఈ క్రమంలోనే, త్రిషను ఎప్పుడు డిప్యూటీ సీఎం చేస్తారంటూ ఆయన ఎద్దేవా చేశారు. నటి త్రిషను ఉద్దేశించి ద్వంద్వార్థాలతో వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై డీఎంకే నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్ట్ చేసి, విచారణ అనంతరం విడుదల చేసిన కొన్ని రోజులకే ఈ కొత్త వివాదం తలెత్తడం గమనార్హం. అయితే, తాను రాష్ట్రానికి కావేరి జలాల గురించి మాత్రమే మాట్లాడానని, తన వ్యాఖ్యలకు ఒకే అర్థం ఉందని అప్పట్లో ఉదయనిధి స్పష్టం చేశారు. ఇప్పుడు ఉదయకుమార్ వ్యాఖ్యలతో త్రిష పేరు మరోసారి తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## సర్జరీ అనంతరం.. సోషల్ మీడియా వేదికగా స్పందించిన జూ ఎన్టీఆర్

తనకు జరిగిన శస్త్రచికిత్స విజయవంతమైందని, ప్రస్తుతం తాను క్షేమంగా ఉన్నానని టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తన ఆరోగ్యం కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయిలో కోలుకుని అందరినీ కలుస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ మేరకు జూనియర్ ఎన్టీఆర్ ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "మీ ప్రేమ, ప్రార్థనలు వెల్లువెత్తాయి. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది, నేను ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాను. నాకు చికిత్స అందించిన కిమ్స్ ఆసుపత్రిలోని అద్భుతమైన వైద్య బృందానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు. అంతేకాకుండా, తనకు నిరంతరం అండగా నిలుస్తున్న మిత్రులు, కుటుంబ సభ్యులు, అభిమానులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. "మీ మద్దతే నాకు ప్రతిరోజూ బలాన్ని ఇస్తుంది. త్వరలోనే మిమ్మల్ని కలుస్తాను" అని తన సందేశంలో పేర్కొన్నారు.



Printed,Published and Owned by : **Konda Narasimha swamy** PRINTED AT **: KOUSAYA PRINTERS ,** H.NO 6-1-948 BOYAWADA STREET, DIST: NALGONGA TELANGANA 508001. RNI NO - **TGTEL/2018/75056.** CELL NO : 7989870511.